
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
ఆదివారం, 4 ఆగస్టు 2024



పారదర్శకంగా పాలన

- రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం
- కొవిడ్ కాలంలో సేవలు సంతృప్తినిచ్చాయి
- ఈ నెల 6తో పదవీకాలం ముగింపు
- అవకాశం కల్పించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు
- ఖమ్మం జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ 6



జల జీవితం




లాంచీని నడుపుతున్న సరంగు

సండే స్పెషల్
SUNDAY SPECIAL

నది ఒడిలో జీవన యాత్ర


లాంచీ నడుపుతున్న డ్రైవరు

- గోదావరిలో లాంచీల ప్రయాణంలో వారిదే కీలకపాత్ర
- సరంగు సంకేతాల మేరకు ముందుకు సాగే డ్రైవర్లు..
- వారికి తోడుగా చుక్కాని, కలాసి...
- దైనందిన జీవనమంతా లాంచీలోనే...
- పర్యాటకుల రక్షణ, సంతోషమే వారి లక్ష్యం
- వరదల వేళ అధికారుల ప్రయాణానికి వారే కీలకం..

నది అలలపై తేలియాడుతూ సాగే లాంచీ ప్రయాణం ఎంతో పరవశం కలిగిస్తుంది. జలరాశుల మధ్య చల్లని గాలులు మేనిని స్పృశిస్తుంటే లాంచీ విహారం మర్చిపోలేని అనుభూతిని మిగుల్చుతుంది. అది గోదావరి లాంటి జీవనదిలో అయితే ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పడం కష్టం. లాంచీ విహారంలో చుట్టూరా ఉన్న ప్రకృతి సోయగాలను తిలకించి పులకించడం ఎవరికైనా సహజం. అయితే ఆ ఆనందవిహారం వెనుక ఐదుగురు కీలక వ్యక్తులుంటారు. వారిని ఎవరూ పెద్దగా పట్టించుకోరు. వారే సరంగు, డ్రైవరు, అసిస్టెంట్ డ్రైవర్, అసిస్టెంట్ చుక్కాని, వంట మనిషి(కలాసి). పర్యాటకుల కోసమే కాదు, వరదల వేళ అధికారుల కోసం లాంచీలను నడపడంలోనూ వీరిది కీలకపాత్ర. ఆద్యంతం నీటిపైనే వీరి జీవన యాత్ర సాగుతూ ఉంటుంది. భార్య, పిల్లలకు దూరంగా కుటుంబ పోషణ కోసం వీరు ప్రాణాలను ఒడ్డి కష్టపడతారు. లాంచీల యజమానులు చేసేది వ్యాపారమైతే, ఈ ఐదుగురు చేసేది జీవన్మరణ పోరాటం. 6
వీరి జీవనశైలిపై ప్రత్యేక కథనం...

- భద్రాచలం



- హరితయజ్ఞంలో అలుపులేని వనజీవి రామయ్య
- 72 ఏళ్ల వయస్సులోనూ మొక్కలు నాటుతూ జీవనం
- ఇప్పటివరకు నాటిన మొక్కల సంఖ్య 2 కోట్లపైనే...
- ఇంకో కోటి నాటడం ద్వారా నోబెల్ గెల్చుకోవాలని లక్ష్యం
- ఐదో యేడు నుంచే ప్రకృతితో సహవాసం
- 2018లో పద్మశ్రీ అవార్డుతో గౌరవించిన కేంద్రం
- పెన్షన్‌ను లక్షన్నరకు పెంచాలని వినతి

ఆయనొక వృక్షం... ‘నోబెల్’ లక్ష్యం...

రోజూ వీలు పడకుంటే, వారానికి ఒక్కరోజన్నా వృక్షసేవకు పాటుపడండన్న పిలుపు ఆయనది. వృక్షో రక్షతి రక్షితః నినాదం ఆయన మెడహారం.. ఆకుపచ్చ మొక్కలు అలంకారం.. ఆయన వాహనానికి తగిలించిన సంచీలో అయితే విత్తనాలు, లేకుంటే మొక్కలు ఉంటాయి. ఆయన చేతిలో కోట్లాది మొక్కలు ప్రాణం పోసుకున్నాయి.. కోట్ల మొక్కలు ఆయన పేరుతో పచ్చగా ఎదుగుతున్నాయి.. ప్రకృతి పరంగా పచ్చదనం పెంచటమొక్కటే ధ్యేయం కాదు.. విలువైన చెట్లద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చటమూ ఆయన ఆశయం.. ఆయనే ‘మొక్కల ప్రేమయ్య దరిపల్లి రామయ్య’. ఇప్పటివరకు 2 కోట్ల మొక్కలు నాటిన రామయ్య.. ఇంకో కోటి మొక్కలు నాటి నోబెల్ బహుమతి గెల్చుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. ఖమ్మం నగర సమీపంలోని రెడ్డిపల్లి కేంద్రంగా రామయ్య చేస్తున్న హరితయజ్ఞం ఎందరికో స్ఫూర్తినిస్తోంది. 6

-ఖమ్మం సాంస్కృతికం


కాలవ పనులు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

15న ‘సీతారామ’ నీటి విడుదల

సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం : మంత్రి తుమ్మల వెల్లడి

ఏన్కూరు, ఆగస్టు 3: ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు నీటి విడుదల కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. శనివారం హిమామనగర్ వద్ద సీతారామ ఏన్కూరు లింక్‌కెనాల్ పనులను పరిశీలించారు. గ్యాస్‌పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడుతూ పూసుగూడెం పంపుహౌస్ ట్రయల్‌రన్ నిర్వహించడం జరిగిందని, మరో వారం రోజుల్లో కమలాపురం పంపుహౌస్ ట్రయల్‌రన్ కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15లోపు పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఏన్కూరు లింక్‌కెనాల్ పనులు కూడా ఆగస్టు 15లోపు పూర్తిచేస్తామన్నారు వర్షాలు, భూసేకరణ, గ్యాస్ పైపులైన్ వల్ల కొంత ఆలస్యం అయినట్టు తెలిపారు. కేవలం రూ.70కోట్లతో సుమారు రెండు లక్షల ఎకరాల భూమి సాగులోకి వస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ భూమి సాగయ్యే ఏకైక ప్రాజెక్టు అని తెలిపారు. భవిష్యత్తులో సాగర్ జలాలు రాకపోయినా గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీతారామ ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ అర్జున్, కాంట్రాక్టర్ మొగిలి శ్రీనివాసరెడ్డి, తుమ్మల ముఖ్య అనుచరుడు గుత్తా వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు స్వర్ణనరేంద్రకుమార్, ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు మేడ ధర్మారావు, శోభన్‌నాయక్, ఆరెం రామయ్య, వాసిరెడ్డి నాగేశ్వరరావు, జాస్తిజనార్ధన్ పాల్గొన్నారు.

పూసుగూడెంలో పంప్‌హౌస్‌ను సందర్శించిన తుమ్మల 7

స్పైసెస్ బోర్డు కథ కంచికేనా?

- ప్రతిపాదనలకే పరిమితమైన ఖమ్మం సబ్‌సెంటర్
- మిర్చిసాగులో ఉమ్మడి జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు
- ఖమ్మం మార్కెట్‌కు ఏటా పోటెత్తుతున్న మిర్చి
- స్పైసెస్ బోర్డు ఏర్పడితే సాగులో రైతులకు మెళకువలు పెరిగే అవకాశం
- ఎంపీలు చొరవ తీసుకోవాలని రైతుల వినతి

ఖమ్మం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలోనే మిర్చిసాగులో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. జిల్లాలో లక్షన్నర ఎకరాలపైగా మిర్చిసాగవుతోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సుమారు రూ.10కోట్ల మేర మిర్చిపైనే ఆదాయం లభిస్తోంది. జిల్లాలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోనే రూ.వెయ్యి నుంచి రూ.1,500కోట్ల టర్నోవర్ మిర్చి పంట నుంచి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో పండే మిర్చికి దేశ, విదేశాల్లో డిమాండ్ ఉన్నందున విదేశాలకుసైతం వ్యాపారులు ఎగుమతులు చేస్తున్నారు. ఇక్కడ సాగవుతున్న మిర్చిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం స్పైసెస్ బోర్డు సబ్‌సెంటర్‌ను ఖమ్మంలో ఏర్పాటు చేసి తద్వారా మిర్చి సాగు రైతులకు మెళకువలు, దేశ, విదేశీ ఎగుమతులకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఉద్యానవనశాఖ గతంలో భావించింది. కానీ దశాబ్దాలుగా ఈ ప్రతిపాదన కేవలం మాటలకే పరిమితమైంది. నేటికీ అది కార్యరూపం దాల్చలేకపోతోంది.

పదేళ్ల క్రితం ఖమ్మంలో సబ్‌సెంటర్ ఏర్పాటుచేసినా రాజకీయ ఒత్తిళ్లతో దాన్ని ఇతర ప్రాంతానికి తరలించారు. మళ్లీ కొత్త సబ్‌సెంటర్‌ను ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. సుగంధద్రవ్యాల కింద మిర్చి పంట వాణిజ్యపంటగా గుర్తింపు పొందింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్నీ మండలాల్లోనూ మిర్చి సాగవుతోంది. అలాగే జిల్లా నుంచి విడిపోయిన సమీప మండలాలు ఏపీలోని అల్లూరి జిల్లా పరిధిలో ఉన్న యటపాక, కూనవరం, చింతూరు, వీఆర్‌పురం, ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాలతో పాటు ములుగు జిల్లాలో కలిసిన వెంకటాపురం, వాజేడు, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం మండలాల్లోనూ మరో 50వేల ఎకరాల్లో మిర్చి సాగవుతోంది. మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోనూ మిర్చిసాగులో ఉంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ కావడంతో ఈ సబ్‌సెంటర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణ, ఏపీలోని రైతులకు కూడా ఉపయోగపడనుంది.

ఖమ్మంలో స్పైసస్ బోర్డు సబ్‌సెంటర్ ఏర్పాటు చేస్తే మిర్చి సాగుతో పాటు ఉప ఉప ఉత్పత్తుల ఎగుమతులు, రైతులకు నాణ్యతా ప్రమాణాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నేరుగా స్పైస్ బోర్డు నుంచి రైతులకు కొంత బడ్జెట్ కేటాయింపులు కూడా జరగనున్నాయి. రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మిర్చిసాగుతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పుడిప్పుడే మిర్యాలు, వక్క, కోకో, జాజి వంటి పంటలు కూడా సాగవుతున్నాయి. ఖమ్మం కేంద్రంగా స్పైసస్ బోర్డు సబ్‌సెంటర్ ఏర్పాటు చేస్తే జిల్లాలో ఇంకా సుగంధద్రవ్యాలకు సంబంధించిన పంటల సాగుపై రైతులకు అవగాహన కలిగించే కార్యక్రమాలు అందుబాటులోకి రానున్నాయి. ఉమ్మడి జిల్లానుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని ఖమ్మంలో స్పైసెస్‌బోర్డ్ సబ్‌సెంటర్ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మత్స్యశాఖలో బది‘లీల’లు

- కోటాకు మించి బదిలీలు
- తర్వాత పూర్వ స్థానాల్లోనే...
- జోన్-1, 2లో అనేకచోట్ల సీనియర్లకు అన్యాయం 6

ఒక్క రోజే 34 కాన్పులు

- 20 వరకు సాధారణ కాన్పులు
- ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల ఘనత


సీఎం వద్దకు వీరాపురం పంచాయితీ

7

- 5 నెలలుగా నిలిచిన ఇసుక రీచ్
- మోకాలడ్డుతున్న ప్రముఖ నేత

మధిరకు ఇండస్ట్రియల్ పార్క్ మంజూరు

పట్టుబట్టి సాధించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


యండపల్లి గుట్ట సమీపంలో ఇండస్ట్రియల్ పార్క్‌కు కేటాయించిన స్థలం

మధిర టౌన్, ఆగస్టు 3: ఖమ్మం జిల్లా మధిర మండలంలోని యండపల్లి రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో ఇండస్ట్రియల్ పార్క్ మంజూరు చేస్తూ శనివారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. యండపల్లి రెవెన్యూలో సర్వేనెం 62, 73లోని 84.26 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇండస్ట్రియల్ పార్క్ మంజూరు చేస్తూ పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ జీవో విడుదల చేశారు. యండపల్లి రెవెన్యూలోని యండపల్లిగుట్ట సమీపంలో ఉన్న ప్రభుత్వభూమిలో పరిశ్రమలు నెలకొల్పి స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని పది సంవత్సరాల క్రితం ఆనాడు డిప్యూటీ స్పీకర్ హోదాలో భట్టి అనేక ప్రయత్నాలు చేయగా నేటికి ఆయన కృషి ఫలించింది. ఇప్పటికే ఇండస్ట్రీయల్ పార్క్‌కు కేటాయించిన భూమి వరకు బీటీ రోడ్డును మంజూరు చేసి శంకుస్థాపన చేయడమే కాకుండా పనులు కూడా ప్రారంభించారు. మధిర ప్రాంతం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఈ పార్క్‌లో ఏర్పాటు చేయాలని, త ద్వారా రైతులతో పాటు ఈ ప్రాంతంలో ఉన్న యువతకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించాలని భట్టి కన్న కలలు మరికొద్ది రోజుల్లో నిజం కానున్నాయి. కాగా ఇండస్ట్రియల్‌పార్క్‌కు సోమవారం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


పాతకాల్వకు నీటిని విడుదల చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రోల్‌మోడల్‌గా కొత్త రెవెన్యూ చట్టం

- ‘ధరణి’ స్థానంలో కొత్త పోర్టల్
- రైతుల సమస్యలు సులువుగా పరిష్కరించడమే లక్ష్యం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పాలేరు జలాశయం నుంచి నీరు విడుదల

వివరాలు : 6లో


దళితబంధు సమీక్షలో మాట్లాడుతున్న భట్టి

‘దళితబంధు’ యూనిట్లు విక్రయిస్తే కేసు

- దారిమళ్లిన వాటిని వారంలోగా లబ్ధిదారులకు అప్పగించాలి
- పథకం అమలులో తప్పు జరిగితే అధికారులూ బాధ్యులే
- సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు : 6లో

'దళితబంధు' యూనిట్లు విక్రయిస్తే కేసు

» సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

చింతకాని, ఆగస్టు 3: దళితబంధు యూనిట్ల క్రయవిక్రయదారులపై కేసులు నమోదు చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. దళితబంధు పథకంపై చింతకాని మండల కేంద్రంలో శనివారం దళితబంధు పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. చింతకాని మండలంలో పథకం అమలుపై అధికారులు రూపొందించిన నివేదికను ఆయన పరిశీలించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ దళితుల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన పథకం లక్ష్యం నెరవేరాలన్నారు. 'దళితబంధు' దారిమళ్లితే సహించేదిలేదన్నారు. పథకం దుర్వినియోగమైతే లబ్ధిదారుడి పాత్ర ఎంత ఉంటుందో ప్రత్యేక అధికారుల పాత్ర అంతే ఉంటుందన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాలను సందర్శించి లబ్ధిదారుల వివరాలు సేకరించి వారికి మంజూరైన యూనిట్లు వారి వద్దనే ఉన్నాయా? లేదా? అనే విషయం తెలుసుకోవాలన్నారు. విక్రయిస్తే ఎవరికి విక్రయించారనే విషయం తెలుసుకొని ఆయా యూనిట్లను గుర్తించి వారంలోగా లబ్ధిదారులకు అందించాలన్నారు.

దళితబంధు పథకం ద్వారా మంజూరైన యూనిట్లను విక్రయించడం, బదిలీ చేయడం నేరమన్నారు. మొదటి దశలో ఆర్థికాభివృద్ధి సాధించిన లబ్ధిదారులకు వారంలోగా రెండోదశ నిధులు విడుదల చేస్తామన్నారు. లబ్ధిదారుల కోసం చింతకాని మండలంలో సూక్ష్మస్థాయి యూనిట్స్ ఏర్పాటుకు వీలుగా అవసరమైతే ఇండస్ట్రియల్ పార్కును మంజూరు చేస్తామని, అందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్‌కు సూచించారు. నియోజకవర్గంలో మరో వంద మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారి వివరాలు కూడా సేకరించాలన్నారు.

లైవ్‌స్టాక్ యూనిట్స్ ఇన్సూరెన్స్ ఇచ్చారా...

మేకలు, గొర్రెలు, గేదెల యూనిట్స్ ఎందుకు చనిపోయాయో విచారించాలని, చనిపోయిన వాటికి ఇన్సూరెన్స్ ఇచ్చారా లేదా అని సంబంధిత జిల్లా అధికారిని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. పశువులు, మేకలు, గొర్రెలకు అమర్చిన ట్యాగ్‌ల ద్వారా వాటిని గుర్తించాలన్నారు. మృతిచెందిన వాటికి వెంటనే ఇన్సూరెన్స్ అందజేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యం వీడి క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక తయారు చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ఎండీ ముజమ్మిల్‌ఖాన్, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, డీఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాస్, జడ్పీటీసీ పర్సగాని కిషోర్, ఎంపీపీ పూర్ణయ్య, డీపీవో విజయనిర్మల, డీఆర్‌డీవో సన్యాసయ్య పాల్గొన్నారు.

నది ఒడిలో జీవనయాత్ర



గోదావరిలో లాంచీల ప్రయాణంలో వారిదే కీలకపాత్ర

భద్రాచలం, ఆగస్టు 3: ఒక్క భద్రాచలమే కాదు, దాని చుట్టు పక్కల గల గోదావరి పరీవాహక ప్రాంతాల్లోనూ లాంచీలు ప్రజల జీవన గమనంలో ఒక భాగంగా కనిపిస్తాయి. పర్యాటక పరంగా ప్రజలకు ఆనందాన్ని పంచడమే కాదు, వరదల వేళ అధికారుల విధి నిర్వహణకు ఎంతో కీలకంగా ఉపయోగపడుతుంటాయి. లక్షలు పోసి లాంచీలను ఏర్పాటుచేసి వ్యాపారం చేసే వారు కొందరైతే, వాటిని నడపడమే వృత్తిగా చేసుకొని జీవనం సాగించే వారు మరికొందరు. ప్రధానంగా లాంచీలపై డ్రైవర్, సరంగ్‌లు ఏపీలోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి అధికంగా ఉంటుంటారు. అందులో ధవళేశ్వరం నుంచే 90 శాతం మంది ఉండటం విశేషం.

డ్రైవర్, సరంగ్‌లు తరతరాలుగా దశాబ్దాల కాలం పైగా ఇదే జీవనాధారంగా ఉన్నారు. కనీస విద్యకు దూరమై, తాతల తండ్రుల కాలం నుంచి వచ్చిన అలవాటును ఆధారంగా చేసుకొని తొలినాళ్లలో తెప్పలు, నాటు పడవలు, బోట్లు నడిపి ఇదే క్రమంలో చివరకు లాంచీలు నడపడంలో స్థిరపడ్డారు. లాంచీని నడపడంలో అనుభవం రావాలంటే ఒక సరంగ్, డ్రైవరుకు కనీసం ఐదు సంవత్సరాలు అంకితభావంతో పని చేస్తేనే ఇందులో పూర్తిస్థాయిలో పరిణితి సాధించగలుగుతారు. ఈ సమయంలోనే సరంగ్ వద్ద, డ్రైవరు వద్ద సహాయకులుగా మరో ఇద్దరు పని చేస్తూ ఉంటారు. దీని ద్వారా తాము నేర్చుకుంటున్న విద్యలో మరింత పురోగతిని సాధిస్తారు. ఈ నలుగురితో పాటు కలాసి కూడా వంట చేయడంతో పాటు ఇతరత్రా పనుల్లో సహకారం అందిస్తారు.

ఆ ఐదుగురే కీలకం...

నీటిపై లాంచీ నడవాలంటే ఆ ఐదుగురు తప్పక ఉండాల్సిందే. డ్రైవరు, సరంగు, అసిస్టెంట్ డ్రైవర్, అసిస్టెంట్ చుక్కాని, వంట మనిషి(కలాసి) ఉంటారు. వీరు ఉంటేనే లాంచీని నడపడం సాధ్యమవుతుంది. వీరిలో సరంగు, డ్రైవరుకు రూ.16,500 ఇస్తారు. అలాగే చుక్కాని, వంట పుట్టి, అసిస్టెంట్ డ్రైవర్‌లకు రూ.14,000 సంబంధిత లాంచీ యజమాని చెల్లిస్తుంటారు. సీజన్ ఉన్నా, లేకపోయినా వారికి ఈ చెల్లింపులు జరుగుతాయి.

ధ్వని సంకేతాలతో...

లాంచీ నడిపే సమయంలో సరంగు ఇచ్చే సంకేతాలను ఆధారంగా చేసుకొని ఇంజన్ దగ్గర ఉన్న డ్రైవరు లాంచీని నడుపుతారు. ఇందులో సరంగు ఇచ్చే సంకేతాలు లాంచీ గమనం సాగేందుకు ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో తొలినాళ్లలో ఈ సంకేతాలు ఇచ్చేందుకు గంటలు వాడేవారు. ప్రస్తుతం కాలింగ్ బెల్‌ను ఉపయోగిస్తున్నారు. ఒక సారి బెల్ కొడితే గేర్ వేయాలి. రెండో బెల్ కొడితే ఎక్సలేటర్ రేజ్ చేయాలి. ఒక బెల్ కొడితే ఇంజన్ స్లో చేయాలి. వెంటనే ఇంకో బెల్ కొడితే ఇంజన్‌ను న్యూట్రల్ చేసుకోవాలి. మూడుసార్లు బెల్ కొడితే లాంచీని రివర్స్ చేసుకోవాలి. ఈ విధంగా సరంగు సంకేతాల ఆధారంగా డ్రైవరు లాంచీని నడపడం జరుగుతుంది. నీటిలో లాంచీ ప్రయాణం సాగేటప్పుడు అత్యవసర పరిస్థితుల్లో గాని, ఇతరత్రా సమయాల్లో కాని వేగాన్ని కనిష్టస్థాయికి తీసుకువచ్చి లాంచీని ఒడ్డుకు చేర్చడం జరుగుతుంది. కాగా లాంచీ గరిష్ట వేగం 35 కి.మీ. ఉంటుంది. ఇది కేవలం ఎగువ నుంచి దిగువకు వెళ్లేటప్పుడే. అదే దిగువ నుంచి ఎగువకు వెళ్లాలంటే వేగం 10 కి.మీ. మాత్రమే.

అంతా లాంచీలోనే...

లాంచీని నడిపే సరంగ్, డ్రైవర్, ఇతర సిబ్బంది పని చేసే సమయంలో అంతా లాంచీలోనే తమ జీవనగమనం సాగించాల్సి ఉంటుంది. ఇందులో ప్రధానంగా వంటావార్పు లాంచీలోనే చేసుకొని భుజిస్తుంటారు. అలాగే లాంచీలో ప్రయాణించే వారికి సైతం రుచికరమైన భోజనం అందిస్తారు. వీరి దైనందిన జీవితం మొత్తం లాంచీలోనే సాగుతుంది.

డ్రైవరు, సరంగ్‌లకు లైసెన్సులు...

రహదారిపై ద్విచక్ర, కారు, ఇతర వాహనాలు నడపాలంటే ఏ విధంగా లైసెన్సు డ్రైవరుకు అవసరమో అదే రీతిలో లాంచీని నడిపేందుకు డ్రైవరు, సరంగ్‌లకు లైసెన్సులు తప్పనిసరి. డ్రైవరుకు లైసెన్సు కావాలంటే కాకినాడ పోర్టు అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అక్కడ డ్రైవర్‌ను పరీక్షించి లైసెన్సు మంజూరు చేస్తారు. అదేవిధంగా సరంగ్‌కు లైసెన్సు కావాలంటే తూర్పుగోదావరి జిల్లా దవళేశ్వరంలో పీడబ్ల్యుడీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. వారు సైతం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ జారీ చేస్తారు. అట్టి లైసెన్సును ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవలసి ఉంటుంది.

పెట్టుబడి...

ఒక లాంచీని కొనుగోలు చేయాలంటే నాడు రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పెట్టుబడి పెట్టేవారు. అయితే గత రెండున్నర దశాబ్దాలుగా పాపికొండలు పర్యాటకంతో లాంచీలకు సరికొత్త హంగులను దిద్దుతున్నారు. అలాగే ఏసీ లాంచీలు, రక్షణ చర్యల కోసం వినియోగించే పరికరాలు, ఇతరత్రా వాటి కోసం రూ.1.30 కోట్ల వరకు ఖర్చవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఎలాగో లాంచీకి ప్రతి ఏటా నీటిపారుదల శాఖ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను తీసుకోవలసి ఉంటుంది. బోట్ సూపర్‌వైజరు, జూనియర్ సూపరింటెండెంట్‌లు ఈ సర్టిఫికెట్లను ఖరారు చేస్తారు.

మూడు తరాలుగా..

కె.సత్యనారాయణ, సరంగు



నాలుగు దశాబ్దాలుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నాను. మాది మూడో తరం. పిల్లలు వేరే ఉపాధిని చూసుకొని జీవిస్తున్నారు. ప్రస్తుతం ఈ వృత్తిలోకి ఎవరు రావడం లేదు. ప్రస్తుతం 40 మంది సరంగులు, 20మంది డ్రైవర్లు మాత్రమే కొనసాగుతున్నారు. రోబోయే రోజుల్లో కొరత ఏర్పడవచ్చు.

రెండున్నర దశాబ్దాలుగా..

టి.రామకృష్ణ, లాంచీ డ్రైవర్



ఈ వృత్తిలో రెండున్నర దశాబ్దాలుగా కొనసాగుతున్నా. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో ఎక్కువ మంది ఈ వృత్తిని ఎంచుకోవడం లేదు. కుటుంబానికి దూరంగా భార్య, పిల్లలను పోషించేందుకు చిన్నప్పటి నుంచి మాకు తెలిసిన ఏకైక జీవనోపాధి ఇదే కావడంతో ఇప్పటికీ దీంట్లోనే కొనసాగుతున్నాం.

మత్స్యశాఖలో బది'లీల'లు

» కోటాకు మించి బదిలీలు
» తర్వాత పూర్వస్థానాల్లోనే పోస్టింగ్
» జోన్-1, 2లో అనేకచోట్ల సీనియర్లకు అన్యాయం

వైరా, ఆగస్టు 3: రాష్ట్రంలోని మత్స్యశాఖలో జరిగిన అధికారుల బదిలీలు మాయామశ్చీంద్రను తలపిస్తున్నాయి. బదిలీల ప్రక్రియ మొత్తం ప్రవసనంగా మారి అపహాస్యం పాలవుతోంది. గతనెల 31తో ముగిసిన ఈ బదిలీల వ్యవహారం 'నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు' అన్నట్లు ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బదిలీల అర్హతలో మొదటి వరుసలో ఉన్నవారిని పక్కనపెట్టి చివరి స్థానాల్లో ఉన్న వారికి, అసలు అర్హత లేనివారికి బదిలీల సౌకర్యాన్ని కల్పించిన ఉన్నతాధికారుల తీరుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. మొదట బదిలీ చేసిన అధికారులను తిరిగి మళ్లీ వారు పనిచేస్తున్న స్థానాల్లోనే నియమిస్తూ చివరిరోజు మత్స్యశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం విస్మయం కలిగిస్తోంది. మళ్లీ జోన్-1, 2 పరిధిలో ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీఎఫ్), ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్(ఎఫ్‌డీవో)కు జరిగిన బదిలీలు విస్మయానికి గురిచేస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నాలుగు సంవత్సరాలు సర్వీస్ పూర్తిచేసుకున్న అధికారుల్లో 40 శాతానికి మించకుండా బదిలీలు చేయాల్సి ఉంది. అయితే మత్స్యశాఖ జోన్-1లో 18మంది ఎఫ్‌డీవోలు ఉండగా 40శాతం బదిలీల ప్రకారం ఏడుగురిని మాత్రమే బదిలీ చేయాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా 13మందిని బదిలీ చేశారు. అయితే ఈ బదిలీలు జరిగిన తీరుపై అనేక అభ్యంతరాలు రావడంతో చివరికి ఆ బదిలీలను ఏడుగురికి మాత్రమే పరిమితం చేశారు. అయితే ఈ బదిలీలు ఎక్కువ సీనియారిటీ ఉన్న వారికే వర్తింపజేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా తక్కువ సీనియారిటీ ఉన్న వారిని బదిలీ చేసి సీనియారిటీ ఎక్కువ ఉన్న వారిని మళ్లీ వారి పాత స్థానాల్లోనే నియమించి మత్స్యశాఖ ఉన్నతాధికారులు తమ ఘనకార్యాన్ని చాటుకున్నారు.

ఖమ్మం జిల్లా వైరా ఎఫ్‌డీవోగా జి.శివప్రసాద్ 12సంవత్సరాల 9రోజులు పనిచేశారు. ఆయన జోన్-1 బదిలీల్లో ప్రథమ స్థానంలో అర్హత కలిగి ఉన్నారు. ఆయన బదిలీల ఆప్షన్‌లో సిరిసిల్ల, వరంగల్, సిద్దిపేట, ఖమ్మం, పెద్దపల్లిని ఎంచుకున్నారు. అయితే అధికారులు ఆయన ఆప్షన్లను పరిగణలోకి తీసుకోకుండా ఆయన ఆశించని మెదక్‌కు బదిలీ చేశారు. బదిలీల్లో తనకు జరిగిన అన్యాయం గురించి మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన విజ్ఞప్తి మేరకు మహబూబాబాద్‌కు బదిలీ చేయగా ఆయన అక్కడ బాధ్యతలు చేపట్టారు. అయితే గతనెల 31న మళ్లీ ఆయనను పూర్వం పనిచేసిన వైరా ఎఫ్‌డీవోగానే పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో విస్మయానికి గురయ్యారు.

అలాగే ఆదిలాబాద్ అధికారి వై.విజయకుమార్, హన్మకొండ ఐఎఫ్‌టీసీలో అధికారి అయిన జె.భాస్కర్, రాజన్నసిరిసిల్ల జిల్లా ఎఫ్‌డీవో వి.విజయ్‌కిరణ్‌కర్, కామారెడ్డి ఎఫ్‌డీవో కె.డొలిసింగ్, ఆసిఫాబాద్ ఎఫ్‌డీవో వై.సాంబశివరావు బదిలీల విషయంలోకూడా గందరగోళం నెలకొంది. సీనియార్టీలో 14వ స్థానంలో ఉన్న పెద్దపల్లి ఎఫ్‌డీవో ఇంత్యాజ్ అహ్మద్‌ఖాన్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేశారు. కేవలం ఒక సంవత్సరం, పదినెలల, 12రోజుల సీనియార్టీ ఉన్న మహబూబాబాద్ ఎఫ్‌డీవో బాణోత్ వీరన్నను మొదట వైరాకు బదిలీ చేసి తిరిగి ఆయనను అక్కడకు పంపించి బదిలీల్లో మొదటి స్థానంలో ఉన్న ఎఫ్‌డీవో శివప్రసాద్‌ను తన పూర్వపు పోస్టింగ్ అయిన వైరాలోనే నియమించారు. అలాగే ఏడీఎఫ్‌ల విషయంలో కూడా ఇదే తంతు జరిగింది. సీనియార్టీని పక్కనపెట్టి ఇష్టానుసారం బదిలీల్లో పోస్టింగ్‌లు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మత్స్యశాఖకు డైరెక్టర్‌గా ఐఏఎస్ ఇతర ఆలిండియా సర్వీస్ అధికారులే ఉంటున్నా ఆ శాఖలో డైరెక్టర్ తర్వాతి స్థానంలో ఉన్న ఒకరిద్దరు అధికారుల కనుసన్నల్లోనే అడ్డగోలుగా ఈ బదిలీలు, డిప్యూటేషన్లు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

పారదర్శకంగా పాలన సాగించాం..

» ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 3: రాష్ట్రంలో పాలన పారదర్శకంగా సాగించామని, కారుణ్య నియామకాల కింద వారికి ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం లభించిందని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అన్నారు. ఈనెల 6తో జడ్పీ పాలక వర్గానికి పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో శనివారం ఆయన చాంబర్‌లో విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఐదేళ్ల కాలం గడిచిన తీరును వివరించారు. కారుణ్య నియామకాల ద్వారా మొత్తం 59 మందికి అవకాశాన్ని కల్పించాని అన్నారు. వాటిలో 14 జూనియర్ సహాయకులు, 45 ఆఫీస్ సబార్డినేట్లకు నియామక ఉత్తర్వులు జారీ చేశామన్నారు. 40 మందికి సీనియర్ సహాయకుల నుంచి పర్యవేక్షకులుగా పదోన్నతులు, 30 మందికి జూనియర్ సహాయకుల నుండి సీనియర్ సహాయకులుగా పదోన్నతులు, ఆరుగురికి రికార్డు అసిస్టెంట్ నుంచి జూనియర్ సహాయకులుగా పదోన్నతులు, 16 మందికి ఆఫీస్ సబార్డినేట్ నుండి రికార్డు అసిస్టెంట్ పదోన్నతులు కల్పించామన్నారు. ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి బాలసాని లక్ష్మీనారాయణ, పువ్వాడ అజయ్‌కుమార్ నిధుల నుంచి మధిర నియోజకవర్గం నందు 1752 మంది లబ్దిదారులకు రూ.432.27 లక్షలు మంజూరీ చేయించామన్నారు. టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వపు ఇన్సురెన్స్ ద్వారా 30 మంది లబ్దిదారులకు 02 లక్షల చొప్పున రూ.60.00 లక్షలు మంజూరు చేయించి పంపిణీ చేశామన్నారు. దళితబంధు పథకం ద్వారా చింతకాని మండలంను పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నిక చేశారన్నారు. చింతకాని మండలంలో 3462 మందిని ఎంపిక చేసి, ఒక్కొక్క అభ్యర్థికి రూ. 10.00 లక్షల చొప్పున మొత్తం రూ.346.20 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. మొత్తం 3462 యూనిట్లకు 3373 యూనిట్లు గ్రౌండ్ చేయడం జరిగిందని వివరించారు. బీసీ బంధు ద్వారా మండలంకు 50 అభ్యర్థుల చొప్పన మున్సిపాలిటితో కలిపి 300 మంది అభ్యర్థులను ఎంపిక చేసి అభ్యర్థికి రూ.1,00,000 చొప్పున 300 మందికి 3 కోట్ల రూపాయలు అందించినట్లు తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వాసుపత్రి చైర్మన్‌గా సమీక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్నామని వివరించారు. ఐదేళ్ల జడ్పీ పాలనలో సహకారం అందించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, అవకాశం కల్పించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రోల్‌మోడల్‌గా కొత్త రెవెన్యూ చట్టం

» రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి

కూసుమంచి, ఆగస్టు 3: రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలకు సమగ్ర పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సరికొత్త చట్టాన్ని తీసుకొస్తున్నట్టు రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ధరణి పోర్టల్ సమస్యలకు కేంద్రబిందువుగా మారిందని లక్షలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారికి అనువుగా ఉండేలా రోల్‌మోడల్లో కొత్త చట్టాన్ని తీసుకవస్తున్నట్లు మంత్రి తెలిపారు.

కూసుమంచి మండలం పాలేరు జలాశయం నుంచి శనివారం పాతకాల్వకు, భక్తరామదాసు ప్రాజెక్టునుంచి పాలేరు రైతాంగానికి సాగర్ జలాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి, కేసీఆర్, సీఎస్ సోమేష్‌కుమార్ ఇరువురు కలిసి ధరణి పోర్టల్ రూపొందించారని తెలిపారు. ప్రస్తుతం ధరణి పోర్టల్ సమస్యలకు కేంద్రబిందువుగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను సముద్రంలో కలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్లు గుర్తుచేశారు. ఈ క్రమంలో భూయజమానులకు సులువుగా అనువుగా ఉండేలా సరికొత్త రెవెన్యూచట్టం తీసుకొస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న పోర్టల్‌కంటే సులువుగా కొత్త వెబ్‌సైట్ రూపొందిస్తున్నట్టు వివరించారు.

రైతును రాజుచేయడమే ప్రభుత్వ లక్ష్యం

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి తెలిపారు. చిత్తశుద్ధితో కష్టపడి రైతులకు మేలు చేయాలని చూస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా రూ.31వేల కోట్లు రుణమాఫీ చేస్తున్నట్లు వివరించారు. చిత్తశుద్ధి, తాపత్రయం ఉంటే ఏదైనా సాధించవచ్చని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరూపించారని అన్నారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల రుణభారం మోపిందని ధ్వజమెత్తారు. అయినా ఎన్నడూ లేనివిధంగా నెల మొదటిరోజునే అధికార యంత్రాంగానికి వేతనాలు చెల్లిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఆర్డీవో గణేష్, ఇరిగేషన్ ఎస్ఈ, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.



దరిపల్లి రామయ్య హరితసేవ కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఆయన ఆకుపచ్చ యజ్ఞంలో పద్మశ్రీ.. ఆయన ఆశయం మొక్కల పెంపకం, శ్వాస, ధ్యాస, వేషం, భాష, వాహనం, ఇల్లు, పరిసరాలు అన్నీ హరితం.. అందుకే ఆయన వనజీవి బిరుదాంకితుడు.. ఖమ్మం నగరాన్ని ఆనుకొని ఉన్న రెడ్డిపల్లి గ్రామం ఆయన ఊరు.. ఎప్పటికప్పుడు కొత్త తరాలకు ఆయన ఆశయం, సంకల్పం సాధించిన మహోన్నతం, ఒనగూర్చిన మేలు తెలియాల్సిన అవసరం ఉంది..

» మూడు కోట్ల మొక్కలు నాటి నోబుల్ బహుమతి సాధనలో అడుగులు
» ఐదో ఏటనే ప్రకృతితో సహవాసం ఆరంభం
» మొక్కలు పెంచడమేకాదు.. ఆదాయం సమకూర్చడం కూడా..
» పద్మశ్రీ లభించినా ఆగని హరిత యజ్ఞం
» నేటి తరానికి అవగాహన కల్పించాలనే ఆశయం

ఆయనొక వృక్షం...

'నోబెల్ లక్ష్యం

ఖమ్మం సాంస్కృతికం, ఆగస్టు 3: పచ్చదనం విస్తరణలో ప్రపంచస్థాయి ఆశయం తనది.. అటవీ భూభాగాన్ని మరింత విస్తరించి ఓజోన్ రక్షణకు పాటు పడటం ద్వారా నోబుల్ బహుమతి సాధించాలన్నది ఆయన జీవితాశయం.. మొక్కల పెంపకంలో అహర్నిశలు శ్రమిస్తూ ముఖ్యమంత్రులు, దేశ ప్రధాని తదితర కీలక నేతలు వీఐపీల దృష్టిని ఆకర్షించిన రామయ్య ఉమ్మడి రాష్ట్రంలోనూ తెలంగాణ ఏర్పాటు తరువాత ముఖ్యమంత్రుల ప్రశంసలు పొందాడు. 2018 మార్చి 30వ తేదీన పద్మశ్రీ గౌరవం పొందిన రామయ్య తన ఆకుపచ్చ కలకు, హరిత యజ్ఞానికి అంతటితో ముగింపు పలక లేదు. లభించిన అత్యున్నత గౌరవం స్ఫూర్తితో మరింత కృషిచేస్తూ నోబుల్ బహుమతివైపు అడుగేస్తున్నాడు.

పచ్చదనపు కృషిలో కెన్యా దేశానికి లభించిన నోబుల్ గౌరవం మన దేశానికీ సాధించాలన్న సంకల్పంతో పాటుపడుతున్నాడు. వయస్సుపైబడినా, శరీరం సహకరించక పోతున్నా లెక్కచేయకుండా మొక్కల విస్తరణకు తన వంతు పోరాటం సాగిస్తున్నాడు.

ఇప్పటి వరకు 2 కోట్లకు పైగా మొక్కలు నాటిన రామయ్య మూడు కోట్ల సంఖ్యను దాటటం ద్వారా నోబుల్ సాధన కలను సిద్ధింప చేసుకునే లక్ష్యంతో ఉన్నాడు. ఇప్పటి వరకు ఆయన నాటిన చెట్లలో టేకు, ఎర్రచందనం, శ్రీగంధం వంటి విలువైన చెట్లను ప్రభుత్వ హరితహారం నిధికి అప్పగించాడు.

స్వయంగా విత్తనాల సేకరణ

మొక్కలను తానే ఉత్పత్తి చేసే రామయ్య ఎండా కాలంలో విత్తనాల సేకరణ చేపడతాడు. వేప, చింత, నేరేడు, సీతాఫలం, తదితర గింజలను సేకరించి మొలకకు అనువుగా ఎండబెడతాడు. వర్షాకాలం మొదలవుతుందనగా వాటిని నారు పోసి నాటు వేసే చర్యలు ప్రారంభిస్తాడు. టేకు, ఎర్రచందనం, శ్రీగంధం వంటి మొక్కలను ఫారెస్టు నర్సరీల ద్వారా సేకరిస్తాడు, ప్రైవేటు నర్సరీల నుంచి కొనుగోలు చేస్తాడు. మొక్కలను దేవాలయాలు, స్కూళ్లు, కాల్వకట్టలు, చెరువు కట్టలు, రహదార్ల వెంట చెట్లను నాటేందుకు ఎంచుకొని వాటి సంరక్షణ బాధ్యతను పరిసర, సంబంధిత వర్గాలకు అప్పగిస్తాడు.

రాత్రి పడుకునేదాకా..


తెల్లవారు ఝామునే నిద్రలేచిన దగ్గర నుంచి రాత్రి పడుకోబోయేదాకా రామయ్య తపన మొక్కలు, విత్తనాలే. మండే ఎండలు, వడగాలులు ఆయన విత్తనాల సేకరణ లక్ష్యానికి భంగం కలిగించలేవు. జోరున కురిసే వానలు ఆయన మొక్కలు నాటే క్రతువుకు ఆటంకపరచలేవు. వృక్షోరక్షతి రక్షితః నినాదాలను మెడలో ధరించి మొక్కలను అలంకరించుకొని అందరినీ ప్రకృతి, పర్యావరణం దిశగా ఆలోచింపచేస్తాడు.

ఐదో ఏటనే..

దరిపల్లి రామయ్యకు తన అయిదవ ఏటనే మొక్కల పెంపకంపై ధ్యాస ఏర్పడింది. చిన్నప్పుడు స్నేహితులతో అగ్గిపెట్టెలను దారానికి కట్టి రైలు బోగీలుగా మార్చి ఆడుకునే వయసులో కావలసినన్ని అగ్గిపెట్టెలు లభించక పోవటం ఆలోచింప చేసింది. తనతల్లి ఇంటి పెరటిలో నాటే బీర, సొర పాదులు తదితర కూరగాయల విత్తనాలు ఆలోచనకు నాందిపలికింది. బీర విత్తనాలు, బీరకాయలో ఉంటే, సొర విత్తనాలు సొరకాయలో ఉంటే అగ్గిపెట్టె విత్తనాలు అగ్గిపుల్లలే అని భావించాడు. అగ్గిపుల్లలను నాటితే అగ్గిపెట్టెలు కాస్తాయని అమాయకంగా భావించాడు. ఆ తర్వాత ఊరి మామిడి తోటలో తోటి స్నేహితులు మామిడి కాయలను దొంగతనంగా కోయటం, అది గమనించగానే స్నేహితులు పారిపోయినా రామయ్య పారిపోలేదు.. తాను దొంగతనానికి రాలేదని స్నేహితుల వెంట స్నేహంగా మాత్రమే వచ్చానని చెప్పటంతో సంతోషించిన తోటమాలి రామయ్యకు రెండు మామిడి పండ్లు బహూకరించి అవి తిని టెంకలు అక్కడే పారేయమని చెప్పాడు.. ఇంటి వద్ద కాయలు తిన్నప్పుడు అమ్మ దూరంగా పారేయమని చెబుతుంది కదా ఇతనేమిటి అక్కడే చెట్టుమొదట్లో వెయ్య మంటున్నావు అని అడిగితే ' అలా వేసిన టెంకలు మొలుస్తాయి.. మొలిచిన మామిడి మొక్కలను ఎక్కడైనా చనిపోయిన చెట్లుంటే అక్కడ నాటుతాం' అని వివరించినప్పుడు మొక్కల పెంపకం ప్రయోజనం మరింత అవగతమైంది. అందరూ ఎవరికి వారు చెట్లు పెంచుకుంటే దొంగతనం చేయాల్సిన అవసరం ఉండదు కదా అన్న అవగాహన ఏర్పడింది. ఐదో తరగతి వరకు ముత్తగూడెం పాఠశాలలో చదివిన రామయ్యకు పాఠశాలలో ఉపాధ్యాయులు తోటపని చేయించటం వల్ల చెట్ల గురించి మరింత తెలిసింది. సాంఘిక శాస్త్రం పాఠాల్లో అశోకుడు దారివెంట చెట్లను నాటించిన విషయం ఆశ్చర్యపరిచింది. దేశమంటే మట్టికాదోయ్.. అన్న గురజాడ సూక్తి, ప్రేరణ కలిగించింది. ఆరోజుల్లో సాధారణ అనారోగ్యసమస్యల నివారణకు చెట్ల బెరడులు, ఆకులు, కషాయాలు, విత్తనాలు, వేర్లు ఉపయోగించటం వల్ల చెట్లు లేకుంటే మనిషి మనుగడ లేదన్న అభిప్రాయం బలపడింది. ఆవిధంగా రామయ్య మొక్కలు నాటే మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టారు.



వనజీవి రామయ్య నివాసం



విస్తృత చర్చ ద్వారా అవగాహన కలగాలి

దరిపల్లి రామయ్య

మొక్కల పెంపకం ప్రయోజనం, చెట్లను కొట్టేయటం వల్ల అనర్థం అనే విషయాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలి. ఒకరోజన్నా మొక్కల సేవకు కేటాయించాలి. చిన్నతనం నుంచే పిల్లలకు మొక్కలను నాటే గుణం అలవర్చాలి. కరెన్సీ నోటుపై మొక్కల పెంపకం చిత్రం, మొక్కలు నాటుతున్న గాంధీమహాత్ముడి చిత్రం ముద్రించాలి.. ప్రభుత్వం నాకు ప్రతినెలా రూ. 50వేల పింఛను ఇస్తోంది. దానిని రూ. 1.50 లక్షలకు పెంచాలి.. మొక్కల కొనుగోలు, నాటటం తదితర వనప్రయోజన అవసరాలకే వాటిని వినియోగిస్తాను. టేకు, ఎర్రచందనం, శ్రీగంధం తదితర విలువైన చెట్ల ద్వారా తిరిగి ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు

ఆదర్శంగా తీర్చిదిద్దాలి

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
» మార్కెట్ ఆధునికీకరణ పనులపై సచివాలయలో సమీక్ష

ఖమ్మం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్రంలోనే మోడల్‌గా ఆధునీకరించేందుకు చేపట్టబోతున్న ఆధునికీకరణ పనులపై వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ అధికారులతో హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 72వేల బ్యాగుల నిలువ సామర్థ్యం ఉండగా ఆధునీకరించడం ద్వారా 1.37లక్షల బ్యాగుల బ్యాగులకు మార్కెట్ యార్డు సామర్థ్యం పెరుగుతుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మార్కెటింగ్‌శాఖ అధికారులతో మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దేశంలోనే అగ్రగామిగా ఉండేలా వ్యవసాయమార్కెట్ అభివృద్ధి ప్రణాళికను తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన మార్పులు చేపట్టాలని అధికారులకు మంత్రి తుమ్మల సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు అందించడంతో పాటు పర్యావరణహితంగా సోలార్ విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయాలని, నీటిసేకరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయమార్కెట్‌లో రైతులకు ఉత్తమ వాణిజ్య సదుపాయాలు అందించే స్థాయిలో అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రైతులకు మార్కెట్ ద్వారా అదనపు ప్రయోజనాలు అందాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు సూచించారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

భద్రాచలం, ఆగస్టు 3: హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాంగా ఆత్మబలిదానం చేసిన పొట్టి శ్రీరాములు పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటయిందన్నారు. అసెంబ్లీలో సీఎం ప్రకటన నేపథ్యంలో ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని భావించడం ఎంత మాత్రం సరికాదన్నారు.

నేడు మళ్లీ పెరగనున్న గోదావరి నీటిమట్టం

భద్రాచలం, ఆగస్టు 3: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం మళ్లీ పెరగనుంది. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు 33.1 అడుగు తగ్గిన గోదావరి నీటిమట్టం అనంతరం శనివారం ఉదయం 6 గంటల వరకు అదే నీటిమట్టం వద్ద నిలకడగా ఉంది. స్వల్పంగా పెరుగుతూ 34.1 అడుగు వద్దకు చేరుకుంది. గోదావరి నీటిమట్టం ఆదివారం మళ్లీ పెరిగే అవకాశాలున్నట్లు సీడబ్ల్యూసీ అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కిన్నెరసాని జలాశయంలో ..

పాల్వంచ రూరల్, ఆగస్టు 3: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి వరదనీరు చేరడంతో శనివారం 404 అడుగులకు నీటిమట్టం పెరిగింది. ఇన్‌ఫ్లో 5వేల క్యూసెక్కుల చొప్పున చేరుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు సామర్థ్యం 407 కాగా 404 అడుగులకు నీటిమట్టం ఉంది.

స్పోర్ట్స్ స్కూల్‌కు 11 మంది జిల్లా క్రీడాకారుల ఎంపిక

» విద్యార్థులను అభినందించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్



స్పోర్ట్స్ స్కూల్లో సీటు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు3: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో 2024-2025 ప్రవేశాలకు గాను భద్రాద్రి జిల్లా నుంచి 11 మంది క్రీడాకారులు ఎంపిక అవడం అభినందించదగ్గ విషయమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల స్పోర్ట్స్ స్కూల్ రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపికలు హకీంపేట్‌లో నిర్వహించగా, భద్రాద్రి జిల్లా నుంచి 13 మంది బాలురు, 10 మంది బాలికలు హాజరయ్యారు. వీరిలో వివిధ క్రీడా విభాగాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి 11 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. 4వ తరగతి చదివేందుకు ఈ క్రీడా ప్రవేశాలలో హకీంపేట్-4, కరీంనగర్-3, అదిలాబాద్-4 స్పోర్ట్స్ స్కూల్లో బాల బాలికలు సీటు పొందారని తెలిపారు. ఎంపికైన వీరిని ప్రత్యేకంగా అభినందించి ఉచిత నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో పరందామరెడ్డి, జిల్లా ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వరచారి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ భట్టు ప్రేమ్‌కుమార్, పీఈటీలు నరేష్, కృష్ణ, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన వారిలో పి.శ్రావణ్‌ఆయాన్(ఆళ్లపల్లి), ఎం.గౌతమ్‌నంద(చర్ల), బి.కార్తీక్(పాల్వంచ), వై.ప్రణీత్‌రోహన్(పినపాక), ఎన్.లిఖిత్‌కుమారి(దుమ్ముగూడెం), బి.దివ్య(ఆళ్లపల్లి), డి.జశ్విత(మణుగూరు), ఎం.భావ్యశ్రీ(టేకులపల్లి), ఎస్.అనితజ్యోతి(దమ్మపేట), జాయ్‌ప్రియ(లక్ష్మీదేవిపల్లి) ఉన్నారు. వీరిలో బాలురు నలుగురు, బాలికలు ఏడుగురు మొత్తం 11 మంది రాష్ట్రస్థాయిలో స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యారు.

లెనిన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

నేలకొండపల్లి, ఆగస్టు3: నేటి యువత చావా లెనిన్ ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం మూటాపురం గ్రామంలో జరిగిన లెనిన్ సంస్మరణ సభలో తమ్మినేని పాల్గొని మాట్లాడారు. ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించాడని, ఆదర్శ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు లెనిన్ లేని లోటు సీపీఎం పార్టీకి తీరని లోటుగానే ఉంటుందన్నారు. ఇంటూరి శేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కేవీరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, కాంగ్రెస్ మండల నాయకుడు గుడిమళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని మూటాపురం గ్రామానికి చెందిన జిల్లా సీపీఎం నాయకుడు చావా లెనిన్ కుటుంబాన్ని శనివారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడిమళ్ల మధు, బెల్లం వాసు, ఏలూరి సురేష్, వెన్నపూసల సీతారాములు, కొర్లకుంట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దమ్మపేట, ఆగస్టు3: దమ్మపేట గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.వీరస్వామి శనివారం తెలిపారు. గతనెల 21న దమ్మపేట గిరిజన గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో గిరిజన గురుకుల పాఠశాలలో 10వతరగతి చదువుతున్న చరణ్, 9వతరగతి చదువుతున్న కె.శ్రీశాంత్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 7న హైదారాబాద్ పరిధిలోని సరూర్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో విద్యార్థులు పాల్గొనున్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందిస్తూ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కోచ్ కృష్ణ, సురేష్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

పకడ్బందీగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ

» మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయాలి

» నాలుగు దశలలో దరఖాస్తుల పరిశీలన

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 3: రాష్ట్రంలో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం ఆయన ఖమ్మం సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి, భూపాలపల్లి జిల్లా ఐడీవోసీ నుంచి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిషోర్ ముందస్తుగా ఎల్ఆర్ఎస్ పథకం కింద వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, ప్రక్రియ పూర్తి చేసేందుకు నిర్దేశించుకున్న ప్రణాళికలు తదితర వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూట్నీ సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సపోర్ట్ సిస్టం అధికారులకు పూర్తిస్థాయిలో అందిస్తామని అన్నారు. 2020 నాటి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రభుత్వానికి నష్టం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీనికి సంబంధించి దాదాపు 20 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ 2020 కింద 25లక్షల 70వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఇప్పటివరకు 4లక్షల 28వేల దరఖాస్తుల స్క్రూట్నీ చేసి 60వేల దరఖాస్తులను ఆమోదించి, ఆ భూముల క్రమబద్ధీకరణ చేశామన్నారు. దరఖాస్తుల స్క్రూట్నీ కోసం జిల్లా కలెక్టర్లు వారి పరిధిలోని ప్రతి గ్రామానికి, మునిసిపాలిటీకి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ వివరాలు సమర్పించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ముందుగా సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) ద్వారా ఆన్‌లైన్‌లో ఫిల్టర్ చేసి, ధరణి ప్రొహిబిటెడ్ జాబితాలోని ఆస్తుల సర్వే నెంబర్లతో చెక్ చేసి 2లక్షల 5వేల 562 దరఖాస్తులను గుర్తించి, సదరు దరఖాస్తుదారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు స్క్రూట్నీ కోసం పంపామన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఆగస్టు మొదటివారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి రాబోయే 3 నెలల వ్యవధిలో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని, ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డీఆర్‌వో సన్యాసయ్య, డీపీవో హరికిషన్, మునిసిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టును సందర్శించిన మంత్రి తుమ్మల

- ట్రయల్‌రన్ విజయవంతంపై అధికారులను అభినందించిన మంత్రి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ములకపల్లి, ఆగస్టు3: పూసుగూడెం గ్రామంలోని వీకే.రామవరం వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్-2ను శనివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. నీటి పారుదలశాఖ అధికారులు పంప్‌హౌస్-2 ట్రయల్‌రన్‌ను విజయవంతం చేయడంతో అధికారులను తుమ్మల అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి గోదావరి జలాలు పూర్తి స్థాయిలో అందించే అందుకు ఏర్పాట్లను చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదలశాఖ సలహాదారు పెంటారెడ్డి, ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ సురేష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్, అడపా నాగేశ్వరరావు, కరుటూరి కృష్ణ, బాల అప్పారావు, సుధీర్ తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు

వీరాపురం పంచాయితీ

● 5 నెలలుగా నిలిచిపోయిన ఇసుక రీచ్ ● మోకాలడ్డుతున్న ప్రముఖ నేత

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): భద్రాది కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని వీరాపురం ఇసుక రీచ్‌కు రాజకీయ గ్రహణం పట్టుకుంది. పదేళ్లుగా ఓ పార్టీ నాయకులు ఇక్కడ ఆధిపత్యం చలాయించగా.. ప్రభుత్వం మారిన తరువాత కూడా వారి పెత్తనం ఏంటనే కారణంతో మొదలైన వివాదం ఏకంగా ఇసుక రీచ్ మూతపడే పరిస్థితి వరకు వెళ్లింది. వీరాపురం రీచ్ కాంట్రాక్టుని సదరు పార్టీకి చెందిన కంపెనీ 13-3-2024 నుంచి 12-3-2025 వరకు దక్కించుకుంది. సుమారు 14,61,885 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతించారు. దీనికి సంబంధించిన స్టాక్ యార్డులో 14,424 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు కూడా ఉన్నాయి. అయితే రాజకీయ కారణాలతో అయిదు నెలలుగా ఇక్కడ ఇసుక తవ్వకాలు నిలిపేశారు.

జిల్లాలో అతిపెద్ద ఇసుక రీచ్ కావడం, వరదల వల్ల కొన్ని రీచ్‌లు మూతపడటంతో ఇసుక సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ ఆదాయానికి కూడా గండిపడుతోంది. అయితే రీచ్‌ను ప్రారంభించే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీ-ఎండీసీ) అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రభుత్వంలో కీలకమైన ఓ నేత ప్రమేయం ఉండటంతో ఈ విషయంలో అధికారులు ఏమి చెయ్యలేకపోతున్నారు. దీంతో పంచాయితీ సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు చేరింది. ముఖ్యమంత్రి సూచన చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంతో తాజాగా మరోసారి ఈ విషయాన్ని ఎండీసీ చైర్మన్ సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. ప్రజల అవసరాలకు తగిన సరఫరా లేకపోవడం, నాయకుల మధ్య ఆధిపత్య పోరుతో అధికారులు తలపట్టుకుంటున్నారు. కాగా ఇదే ఇసుక రీచ్ పంచాయితీ వల్ల ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి కూడా బదిలీ కావాల్సి వచ్చిందనే ప్రచారం జరుగుతోంది.

సౌర విద్యుత్ వినియోగానికి ప్రాధాన్యత

» కేఎంసీలో పూర్తి స్థాయిలో నిధులు కేటాయిస్తాం

» మేయర్ పునకొల్లు నీరజ వెల్లడి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 3: సౌర విద్యుత్ వినియోగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు, నగరపాలక సంస్థతో పాటుగా అవసరమైన వీధి లైట్లు, ఇతర విద్యుత్ అవసరాలకు సోలార్ ప్లాంట్స్ నిర్మాణానికి కార్యాచరణ చేస్తున్నామని ఖమ్మం నగరపాలక సంస్థ మేయర్ పునకొల్లు నీరజ పేర్కొన్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'నిధులిస్తేనే వెలుగు' కథనంపై స్పందించారు. సౌర విద్యుత్ ఉత్పత్తి అవసరాల మేరకు రానున్న కౌన్సిల్ సమావేశాల్లో నిధులు కేటాయిస్తామని తెలిపారు.

సింగరేణిలో ఒకే రోజు 178 మంది బదిలీ

ఇల్లెందు/కొత్తగూడెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్‌లో శనివారం వివిధ విభాగాలకు సంబంధించిన 178 మంది అధికారులను బదిలీలు చేస్తూ సింగరేణి కాలరీస్ ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సెల్ జనరల్ మేనేజర్ (పర్సనల్) ఉత్తర్వులు జారీ చేశారు. మైనింగ్ విభాగంలో 47 మంది అధికారులకు, ఈ అండ్‌ఎం విభాగంలో 75 మందికి, పర్సనల్ విభాగంలో 19 మందికి, ఎక్స్‌ప్లోరేషన్ విభాగంలో 8 మందికి, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో 17 మందికి, ఫారెస్ట్ విభాగంలో 7 గురికి, సర్వే డిపార్ట్‌మెంట్‌లో ఇద్దరికి, ఎస్టేట్స్ విభాగంలో ఇద్దరికి, మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో ఒక అధికారినీ బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది.

సత్తుపల్లిలో చోరీ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు3: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి సుమారు రూ.9లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైన సంఘటన శనివారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక బేతుపల్లి గంగారం హైస్కూల్‌లో పనిచేసే షేక్.హలీమ్, తుంబూరు హైస్కూల్‌లో పనిచేసే పీడీ మాలిని అనే భార్యభర్తలు హైదరాబాద్‌లోని రేవంత్‌రెడ్డి సభకు వెళ్లి తెల్లవారుజామున ఇంటికి వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరు వాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోని మూడు బీరువాలు పగులకొట్టి వాటిల్లోని 6తులాల బంగారం, 50తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదుతో దొంగలు అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్, పోలీసులు సంఘటానా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం..

సత్తుపల్లిరూరల్, ఆగస్టు3: ఓ ఇంట్లో పార్కింగ్ చేసిన బుల్లెట్ వాహనం చోరీ అయిన సంఘటన సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గుడిపాడులోని నివాసం ఉంటున్న ఇమ్మనేని శ్రీనివాసరావు తన బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు శుక్రవారం రాత్రి పార్క్ చేశాడు. శనివారం ఉదయం లేచేసరికి వాహనం కనిపించలేదు. ఈ విషయమై బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్ కోసం విద్యార్థుల ఆందోళన

● పోలంపల్లి తండాలో ఘటన

కారేపల్లి, ఆగస్టు3: మండల పరిధిలోని గేటు పోలంపల్లి తండాలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు ఇటీవల బదిలీపై వెళ్లాడు. అయితే అతడి స్థానంలో రావాల్సిన ఉపాధ్యాయుడు రాకపోవడంతో శుక్రవారం ఎంఈవో సీఆర్‌పీని పాఠశాలకు పంపించాడు. కాని శనివారం పాఠశాలకు ఎవరు రాకపోవడంతో విద్యార్థులు పదిగంటల తరువాత గేటు ముందు బైఠాయించారు. తమకు వెంటనే ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని వెంటనే ఎంఈవో జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకవెళ్లారు. దీనిపై స్పందించిన డీఈవో సోమశేఖరశర్మ సోమవారం నుంచి రెగ్యులర్ ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

లారీని దొంగిలించిన వ్యక్తి పట్టివేత

మణుగూరు, ఆగస్టు3: మణుగూరులోని ఓల్డ్ సీఎస్‌పీ వద్ద శనివారం లారీ ఓనర్స్ కార్యాలయ సమీపంలో ఆపి ఉన్న లారీని ఓ దొంగ చాకచక్యంగా దొంగిలించి రామానుజారం ప్రధాన రహదారిపై పారిపోశాగాడు. ఆపి ఉన్న లారీ కనిపించక పోయే సరికి లారీ యజమానులు అంతా కలసి వెతకడం ఆరంభించారు. కాగా లారీకి ఉన్న జీపీఎస్ సిస్టమ్ ద్వారా అది వరంగల్ వైపు కొండాయిగూడెం సమీపంలో ఉన్నట్లు గ్రహించారు. వెంటనే వెంబడించి, లారీని నిలిపివేసి దొంగను పట్టుకున్నారు. దొంగకు దేహశుద్ధి చేసి, అనంతరం పోలీసులకు అప్పగించారు.

వినూత్న ఆలోచనలతోనే అద్భుత ఆవిష్కరణలు

» సైయంట్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి

» నటుడు తనికెళ్ల భరణికి ఎస్సార్‌యూ గౌరవ డాక్టరేట్

» అట్టహాసంగా ఎస్సార్ యూనివర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవం



ఎస్సార్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న తనికెళ్ల భరణి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 3: వినూత్నంగా ఆలోచనలు చేసినప్పుడే అద్భుతమైన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని సైయంట్ టెక్నాలజీస్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ద్వితీయ స్నాతకోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బీవీఆర్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతను జోడిస్తూ మానవతా విలువలతో కూడిన ఆవిష్కరణలను చేయాల్సిన బాధ్యత బావి ఇంజనీర్లపై ఉందన్నారు. ప్రస్తుతం టెకేడ్ నడుస్తోందని, సృజనాత్మకతో కూడిన ఆవిష్కరణలతో ఉద్యోగాలు సాధించే అవకాశాలతో పాటు మీరే సంస్థలకు వ్యవస్థాపకులుగా మారవచ్చన్నారు. థామస్ అల్వా ఎడిసన్, అబ్దుల్ కలాం లాంటి మహనీయులు వినూత్నమైన, సృజనాత్మకతతో కూడిన ఆలోచనలతో అద్భుతమైన ఆవిష్కరణలను చేశారని గుర్తుచేశారు. వారి స్ఫూర్తితో తాను 1992లో నలుగురు ఇంజనీర్లతో సైయంట్ టెక్నాలజీస్ ప్రారంభించానని, ఆ టెక్నాలజీస్ ఇప్పుడు 21 దేశాల్లో 18 వేల మంది ఇంజనీర్లతో 16సేవలు అందిస్తూ రూ.700కోట్ల టర్నోవర్‌తో సైయంట్ టెన్నాలజీస్‌ను నిలబెట్టిందన్నారు. మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు సైయంట్ సేవలు అందిస్తోందన్నారు.

యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్‌గార్గ్ మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధిని, ఎస్సార్ విద్యా సంస్థల ఎదుగుదలను వివరించారు. అనంతరం సినిమా, సాహిత్య రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్నందుకు గాను సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణికి గౌరవ డాక్టరేట్‌ను అందించారు. చాన్స్‌లర్ వరదారెడ్డి మాట్లాడుతూ.. 2002లో స్థాపించిన ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్నో మైలురాళ్లు దాటి యూనివర్సిటీ స్థాయికి చేరిందన్నారు. అనంతరం వివిధ కోర్సుల్లో పట్టభద్రులైన విద్యార్థులకు, పీహెచ్‌డీ పొందినవారితో పాటు వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచి బంగారు తదితర పతకాలు పొందిన విద్యార్థులకు ఆహుతుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో చాన్స్‌లర్ ఎ.మధుకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, కోర్ కమిటీ మెంబర్లు ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ వి.మహేష్, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ రామ్‌దేశ్‌ముఖ్, మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ ఎన్. సుమన్‌కుమార్, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కష్టపడితేనే బంగారు భవిష్యత్తు : తనికెళ్ల భరణి

విద్యార్థులు చదువుకునేటప్పుడు కష్టపడితేనే బంగారు భవిష్యత్తును అనుభవిస్తారని ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. తనకు సినిమా, నాటకాలు, సాహిత్యం లాంటి రంగాల్లో అనేక గౌరవాలు దక్కాయని, ఎస్సార్ యూనివర్సిటీ తనను గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఒక్కరోజే 34 కాన్పులు

● ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల ఘనత



కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకుంటున్న వైద్యులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 3: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శనివారం ఒక్కరోజే 34 కాన్పులు చేసి వైద్యులు రికార్డు సృష్టించారు. గతంలో వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడు సాధారణ కాన్పులు జరిగినప్పటికీ మెడికల్ కళాశాలకు బోధనాస్పత్రిగా మారిన తర్వాత శనివారం ఒక్క రోజే 34 కాన్పులు చేశారు. ఇక్కడి వైద్యులు గైనకాలజిస్ట్ విభాగాధిపతి డాక్టర్ యామిని ఆధ్వర్యంలో డాక్టర్ అస్రా, డాక్టర్ మీనా, డాక్టర్ సంధ్య సమక్షంలో ఈ కాన్పులను నిర్వహించారు. వీటిలో 20 వరకు సాధారణ కాన్పులు నిర్వహించగా, 14 కేసులకు మాత్రం ఆపరేషన్ చేయాల్సి వచ్చిందన్నారు. గత జూన్ నెలలో మొత్తం 497 కాన్పులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. గైనకాలజిస్ట్ వైద్యులను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ రాంబాబు, రాథోడ్ నాయక్‌లు అభినందించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



రాంబాబు(ఫైల్)

మణుగూరు, ఆగస్టు 3: మణుగూరులోని పైలట్ కాలనీలో గల ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నిట్టా రాంబాబు (47) గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంబాబు శనివారం ఉదయం ఛాతిలో నొప్పి వస్తుందని తెలపడంతో వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో మరోసారి గుండెపోటు రావడంతో మృతి చెందా డు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యూటీఎఫ్ యూనియన్ నాయకులు వెంకటరెడ్డి, పోలెబోయిన అనిల్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చేపల మార్కెట్ సౌకర్యం కల్పించండి

● కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు మత్స్యకారుల వినతి

కూసుమంచి, ఆగస్టు 3: చేపలు అమ్ముకునేందుకు సౌకర్యం లేనందున చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని పాలేరు మత్స్యకారులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కోరారు. శనివారం ఖమ్మంజిల్లా కూసుమంచి మండలం పాలేరు జలాశయం నుంచి పాతకాల్వకు నీటివిడుదల కార్యక్రమంలో పాల్గొనేందుకు కలెక్టర్ పాలేరు వచ్చారు. ఈసందర్భంగా జలాశయం వద్ద ఖమ్మం-సూర్యాపేట ప్రధానరహదారిపై చేపల దుకాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా మత్స్యకారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాలేరు జలాశయం ఆధారంగా కొన్నేళ్లుగా చేపలవేట సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రోడ్ల పక్కనే విక్రయించుకోవాల్సి వస్తుందని తెలిపారు. మార్కెట్ సౌకర్యం కల్పిస్తే విక్రయాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా చేపలు కడుక్కునేందుకు కూడా బోరు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అవసరం అయితే బోరు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు.

తప్పతాగి విధులకు హాజరైన ఉద్యోగి

» మద్యం మత్తులో పశువులకు వైద్యం చేసేందుకు నిరాకరణ

» రైతుల నిరసన, జేడీఏకు ఫోన్‌లో ఫిర్యాదు

» ఖమ్మం జిల్లా చింతగుర్తిలో ఘటన



పశు వైద్యశాలలో నిరసన తెలుపుతున్న చింతగుర్తి గ్రామస్థులు

రఘునాథపాలెం, ఆగస్టు 3: పశు వైద్యశాలలో ఓ ఉద్యోగి మద్యం తాగా విధులకు హాజరయ్యాడని ఆరోపిస్తూ గ్రామస్థులు నిరసన తెలిపిన ఘటన శనివారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు ములుగూరు నరేశ్ శనివారం ఉదయం తన గేదెను తీసుకొని గ్రామంలోని పశువైద్యశాలకు వచ్చాడు. ఈ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న కాంపౌండర్ మద్యం మత్తులో కదలలేని స్థితిలో ఉండి గేదెకు వైద్యం అందించేందుకు నిరాకరించారు. దీంతో సదరు రైతు తన గేదెను తిరిగి ఇంటి వద్ద కట్టేసి ఈ విషయాన్ని గ్రామ తాజా మాజీ సర్పంచ్ మెంటం రామారావు, నాయకులు తమ్మినేని నాగేశ్వరరావులకు తెలిపాడు. దాంతో గ్రామస్థులు భూక్యా వెంకన్న, కొత్త కోమరయ్య, జీలుగమట్ల వెంకటరమణ, బాధావత్ రాందాస్, అడెపు శ్రీను మరి కొందరితో కలిసి పశు వైద్యశాలకు వెళ్లారు. అయితే గ్రామస్థులు వైద్యశాలకు వస్తున్నారనే విషయం తెలుసుకున్న కాంపౌండర్ అక్కడ నుంచి తప్పించుకొని వెళ్లిపోయాడు. దీంతో ఈ విషయాన్ని గ్రామ నాయకులు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారికి ఫోన్‌లో తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహణ తీరుపై నాయకులు, గ్రామస్థులు ఆసుపత్రి వద్దే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేసే కాంపౌండర్ నిత్యం మద్యం తాగి విధులకు హజరవుతున్నాడని, పశువులకు సరిగా వైద్యసేవలు అందించడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ నడుస్తున్నందున ఆసుపత్రికి మంచి సిబ్బందిని కేటాయించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి




తబుసుమ్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు3: నియోజకవర్గ కేంద్రంలోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం రేగళ్లపాడుకు చెందిన సయ్యద్ ఉస్మానా బాషా, సబీహాల కుమార్తె సనా తబుసుమ్(15) నాగుపల్లి హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. శుక్రవారం నుంచి విరోచనాలతో బాధపడుతుండగా బుగ్గపాడులోని ఆర్ఎంపీ వైద్యుడు చికిత్స పొందుతుంది. శనివారం ఉదయం కూడా అక్కడ వైద్యం అందిస్తుండగా ప్లేట్‌లెట్స్, బీపీ తగ్గటంతో సదరు కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అందిస్తుండగా శనివారం రాత్రే ప్లేట్‌లెట్స్ 40వేల నుంచి 14వేలకు పడిపోయాయని, బాలిక పరిస్థితి విషమంగా ఉందని ఖమ్మం తీసు కెళ్లాలని అంబులెన్స్ ఎక్కించారు. అప్పటికే బాలిక మృతి చెందిందని బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. సంఘటనా స్థలానికి పట్టణ సీఐటీ.కిరణ్ చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. ఆసుపత్రి వైద్యుడు సాగర్ విలేకరులతో మాట్లాడుతూ బాలికవిరోచనాలు, వాంతులు అవ్వడంతో పాటు ప్లేట్‌లెట్స్‌తగ్గి బీపీ పడిపోయిందని తెలిపారు. డెంగ్యూ జ్వరం వలన కిడ్నీ, లివర్ ఫెయిల్యూర్ కావడం వలన డెంగ్యూ షాక్‌తో మృతిచెందినట్లు తెలిపారు. బంధువుల ఆందోళన శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది.

మధిరలో వ్యక్తి ఆత్మహత్య

మధిరటౌన్, ఆగస్టు3: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మధిర పట్టణంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధిరలోని పింగళి వారి వీధికి చెందిన మాచర్ల ప్రవీణ్(45) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రవీణ్ తన కుటుంబంతో హైదరాబాద్‌లో ఉంటూ అక్కడే ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. కాగా నిన్ననే మధిరలోని తన అన్న ఇంటికి వచ్చాడు, ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. టౌన్ ఎస్ఐ సంధ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పాఠశాలల దత్తతకు ముందుకొచ్చిన 'తానా'



హైస్కూల్‌ను సందర్శిస్తున్న తానా బృందం

తల్లాడ, ఆగస్టు3: మండల పరిధిలోని బిల్లుపాడులోని జడ్పీఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను దత్తత తీసుకొనేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ముందుకొచ్చింది. బిల్లుపాడులో ఇటీవల మృతిచెందిన సీనియర్ రాజకీయ నేత జక్కంపూడి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ జక్కంపూడి ప్రేమలత కుటుంబాన్ని శనివారం తానా అధ్యక్షుడు కొడాలి నరేన్, పూర్వ అధ్యక్షుడు వేమన సతీష్‌లతో కూడిన ప్రతినిధి బృందం పరామర్శించారు. అనంతరం బిల్లుపాడులోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల అభివృద్ధికి జక్కంపూడి కృష్ణమూర్తి కుటుంబం అందించిన సేవలను కొనియాడారు. వారి స్ఫూర్తితో రెండు పాఠశాలలను దత్తత తీసుకొని పూర్తిస్థాయిలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ప్రకటించారు.

కౌన్సిల్ అమోదం లేకుండానే
ఉద్యోగ నియామకాలు

- మేయర్ అనుమతి రాకున్నా వేతనాలు
- ఏడాదిగా టౌన్‌ప్లానింగ్‌లో పనిచేస్తున్న పది మంది
- 5న కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగ అమోదాలకు ప్రయత్నాలు



ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు3: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పాలకవర్గానికి సమానంగా కొందరు అధికారులు మరో సమాంతర పరిపాలన సాగిస్తున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. కేఎంసీ కౌన్సిల్ వద్ద, ప్రతిపాదనలు, అమోదం లేకుండా, చివరికి మేయర్ అనుమతి రాకుండానే కొందరు అధికారులు తమ బంధుప్రీతిని చూపించుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్, ఇతర టౌన్ ప్లానింగ్ అవసరాలకు ఉద్యోగులు కావాలని వారే ఎంపికలు పూర్తి చేశారు. పారిశుధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్, రోజువారీ కూలీలు నియామకం జరగాలంటే తప్పనిసరిగా కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదనలు పెట్టాలి. వాటిని అమోదించిన తర్వాతనే అమలు చేయాల్సి ఉంటుంది. గతేడాది టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఎల్‌ఆర్‌ఎస్ పత్రాలు పరిశీలన పేరుతో ప్రజాప్రతినిదులకు సమాచారం లేకుండా అధికారులే నిర్ణయాలు తీసుకున్నారు.అనాధికారికంగా 10మందిని నియమించారు. తర్వాత వారిని ఉద్యోగంలో కొనసాగించారు. ప్రతీ నెల ఒక్కో ఉద్యోగికి రూ.20వేల వేతనాలను సైతం ఫిక్స్ చేశారు. ఏడాదిలో మూడు కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. కానీ అధికారులు స్వయంగా జరిపిన ఉద్యోగ నియామకాల విషయం బయటకు రానివ్వ లేదు. కమిషనర్‌ను సైతం తప్పుదోవ పట్టించారు. కమిషనర్ వద్దకు వెళ్లి అక్రమ ఉద్యోగుల వేతనాలు చెల్లించే ప్రక్రియను గుట్టు చప్పుడు కాకుండా ఫైల్ మూమెంట్ చేశారు. అందుకు కమిషనర్ అమోదించక పోవటంతో తాము ఏడాదిగా చేస్తున్న ఉద్యోగాలకు ఇప్పుడు అనుమతి ఇవ్వాలంటూ పలువురు కార్పొరేటర్లను వెంటబెట్టుకొని వారం రోజులుగా మేయర్ నివాసం చుట్టూ ప్రదీక్షణలు చేస్తున్నారు. సోమవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో తమకు ఉద్యోగాలు కల్పించాలని సిఫారసులు ప్రారంభించారు. కేఎంసీ ఉద్యోగులకంటే వీరి పెత్తనం ఎక్కువైందని ఇటీవల బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఏకపక్షంగా 10 మందికి ఉద్యోగాలు ఇచ్చిన అధికారులే ఇప్పుడు మరో అడుగుముందుకేసీ వారిని ఉద్యోగులుగా గుర్తించాలని పడరాని పాట్లు పడుతున్నారు. ముందుగా తమ పాత్రలేదని బుకాయించిన అధికారులు ఉద్యోగ నియామక అగ్రిమెంట్ పత్రాల్లో వారి సంతకాలు చేసి ఉండటంతో తప్పుకోలేక పోతున్నారు.

విచారణ నిర్వహిస్తాం: పునకొల్లు నీరజ, మేయర్



కౌన్సిల్‌లో అనుమతి పొందిన తర్వాత పాలకవర్గం నిర్ణయం మేరకు ఏ పనైనా చేయాలి. ఏడాదిగా తాము ఉద్యోగాలు చేస్తున్నామని ఇటీవల కొంతమంది వచ్చారు.పాలకవర్గం ఎవ్వరికి ఉద్యోగాలు ఇవ్వలేదని, కౌన్సిల్‌లో ఎటువంటి అనుమతి తీసుకోలేదని వారికి చెప్పాం. ఉద్యోగ నియామకాలపై కమిషనర్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో విచారణ చేపడ్తాం.

భూమిలేని ప్రతీ నిరుపేదకు రూ.12వేలు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో భట్టి

ముదిగొండ,ఆగస్టు3: భూమిలేని ప్రతీ నిరుపేద కుటుంబానికి రూ.12వేలు ఆర్థికసాయం అందజేయనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా కమలాపురంలో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మల్లన్నపాలెం గ్రామంలో 132/33విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ రూ.72వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించినట్లు తెలిపారు. భూమి లేని నిరుపేద కుటుంబాలకు రూ.12వేలు ఇచ్చేందుకు బడ్జెట్లో నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. మహిళలను ఆర్థికంగా ఆదుకొనేందుకు ప్రతి సంవత్సరం రూ.20వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీసీడీఎల్ ఛైర్మన్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జడ్పీటీసీ పసుపులేటి దుర్గ, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బులెట్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు రవీందర్‌రెడ్డి, వనం ప్రదీప్త, భద్రారెడ్డి, ఆదినారాయణరెడ్డి, వీరబాబు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఉసికల రమేష్, గుడిపూడి ఝాన్సీరాణి, బుచ్చిరామయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

పాలేరు సమగ్రాభివృద్ధే లక్ష్యం

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి


గంగమ్మకు పూజలు చేస్తున్న మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం,ఆగస్టు3: పాలేరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 101మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పాలేరు నియోజకవర్గంలో సాగు,తాగునీరు,విద్యా,వైద్యం రహదారులు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తిరుమలాయపాలెం మండలంలో ఉన్న వంద పడకల ఆసుపత్రిని ఏప్రాంతానికి తరలించమని, దీనిపై అఖిలపక్ష సభ్యులు అపోహలు పెట్టుకోవద్దన్నారు. అలాగే తిరుమలాయపాలెం ఆసుపత్రిలో మాతా శిశుసంక్షేమ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే మండల కేంద్రంలో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇస్లావత్‌తండా వద్ద భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు కాలవలోకి విడుదల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పాలేరు నియోజకవర్గాన్ని కృష్ణాగోదావరి నీరు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని మరో కోనసీమగా తయారుచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి, జిల్లానాయకులు రామ సహాయం నరేష్‌రెడ్డి, ఎంపీపీ బోడ మంగిలాల్, జడ్పీటీసీ బెల్లం శ్రీను, ఏవో సీతారాం రెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, కాంగ్రెస్ నాయకులు ముక్కపాటి నాగేశ్వరరావు, ఎన్నం సుధాకర రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, రాజా,సిరిగద్దె ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా తిరుమలాయపాలెంలోని బస్టాండ్‌సెంటర్‌లో కాంప్లెక్స్ నిర్మించాలని, పబ్లిక్ టాయి లెట్లు ఏర్పాటు చేయాలని వందపడకల ఆసుపత్రి తరలించవద్దని కోరుతూ అఖిలపక్ష పార్టీ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము శ్రీను, ఎన్.దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ఖమ్మంలో రహదారుల మరమ్మతులకు రూ.20లక్షలు

ఇంజనీరింగ్ అధికారుల సమావేశంలో మేయర్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు3: ఖమ్మం నగరంలో రహదారుల మరమ్మతులకు రూ.20నిధులు కేటాయించారు. ఇటీవల వర్షాలకు ఖమ్మం నగరంలోని రహదారులు గుంతలు పడ్డాయి. గొల్లగూడెం రోడ్డులో గుంతలపడి ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. కొత్త బస్టాండ్‌సెంటర్, ప్రశాంతినగర్, గాంధీచౌక్, పంపింగ్‌వెల్‌రోడ్డు, కమాన్‌బజార్, వైరారోడ్డు, ఎన్‌ఎస్‌టీ రోడ్డు ఇలా నగర వ్యాప్తంగా గుంతలు ఏర్పాడ్డాయి. దీంతో పలువురు కార్పొరేటర్లు ఫిర్యాదుల మేరకు శనివారం మేయర్ పునకొల్లు నీరజ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. రూ.20 లక్షలతో రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌ఈ వేముల రంజిత్‌తో డీఈలు మాధవి, ధరణి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం


రోగులను పరీక్షిస్తున్న అనిల్‌కుమార్

ఖమ్మంటౌన్, ఆగస్టు3: నగరంలోని ఎన్నెస్టీ క్యాంప్‌లోని మంచికంటి భవన్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. మెడికల్ క్యాంప్‌లో 300 మందికి గుండెకు సంబంధించి 2డీఎకో పరీక్షలను ప్రముఖ వైద్యుడు పేర్ల హర్షతేజ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్తంభాద్రి హాస్పిటల్ వైద్యులు మేదరమెట్ల అనిల్‌కుమార్, గుమ్మడి రాఘవేంద్ర, డొగుపర్తి కృష్ణ సుమంత్ 400మంది రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. అలాగే ప్రముఖ వైద్యుడు చీకటి భారవి, కొల్లి అనుదీప్, పిల్లలమర్రి సుబ్బారావు, జెట్ల రంగారావు ఆధ్వర్యంలో బీపీ, షుగర్, పక్షవాతం రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్తంభాద్రి ఆస్పత్రి వైద్యులు గట్టినేని సురేష్, సీపీఎం జిల్లాకార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. అనారోగ్యానికి దూరంగా ఉండాలంటే ప్రతిరోజు వ్యాయామం చేస్తూ, సమతుల్యం కలిగిన ఆహార నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, నాయకులు వై.శ్రీనివాసరావు, పీ.ఝాన్సీ, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన

సత్తుపల్లి, ఆగస్టు3: ఈనెల 5నుంచి 9వ తేదీ వరకు మండలంలో జరిగే స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన ఉండాలని ఎంపీడీవో నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలతో సమీక్షించారు. చిన్న సంఘాలు, గ్రామసంఘాలు సమావేశాలు జరుపుకుని అజెండా అంశంగా చర్చించి పనులు జరుపుకోవాలన్నారు.

ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

కల్లూరు: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎంపీపీ బీరవల్లి రఘు, ఎంపీడీఓ చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రఘు అధ్యక్షతన ఈ కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

మట్టి మనిషికి పంటపై మమకారం





వైరా,ఆగస్టు 3: కేవలం నాలుగుకుంటల భూమిలో సాగుచేసిన వరిపైరును కాపాడుకొనేందుకు వైరాకు చెందిన కాకాటి నర్సింహారావు భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద నల్లవాగు పక్కనున్న తన నాలుగు కుంటల భూమిలో వారంరోజుల కిందట వరినాటు వేశాడు. నాటి నుంచి వర్షాలు కురవడం లేదు. నల్లచెరువు నీళ్లు కూడా రావడం లేదు. వైరా రిజర్వాయర్ నుంచి ఆరోతేదీన సాగునీరు విడుదల చేయనున్నారు. అయితే ఇప్పటికే నాటువేసిన పొలం నెర్రెలు బారింది. నాటు మొత్తం ఎండిపోతుండటంతో దీన్ని కాపాడుకొనేందుకు శనివారం ఒక ట్యాంకర్ ద్వారా నీరు పెట్టుకున్నారు. రూ.రెండువేలు ఖర్చుచేసి నాలుగుకుంటల భూమిలోని వరిపంటను కాపాడుకుంటే.. రిజర్వాయర్ నుంచి వచ్చే నీటి ద్వారా పంట పండించుకుంటామని రైతు తెలిపారు.

విధుల్లో అలసత్వం వహించవద్దు

డీఎంహెచ్‌వో మాలతి

తిరుమలాయపాలెం, ఆగస్టు3: వైద్యసిబ్బంది విధి నిర్వాహణలో అలసత్వం వహించకుండా వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో మాలతి పేర్కొన్నారు. శనివారం తిరుమలాయపాలెంలోని వైద్యవిధానపరిషత్ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడారు. వైద్యసేవలు సక్రమంగా అందుతాయన్నా అడిగి తెలుసుకున్నారు. డెంగీ, మలేరియా, విషజ్వరాలు వస్తున్నాయని, వీటిపట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో కూడా వైద్యసిబ్బంది పర్యటించి వైద్యసేవలందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ కృపా ఉషశ్రీ, వైద్యులు బొల్లికొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోండి

- పొంగులేటి ప్రసాదరెడ్డి


ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రసాదరెడ్డి

నేలకొండపల్లి, ఆగస్టు3: గురుకుల పాఠశాలకు వితరణ చేసిన ఆర్వో ప్లాంటును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొంగులేటి సోదరుడు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి కోరారు. సింగారెడ్డిపాలెం గురుకుల పాఠశాలకు పీఎస్సార్ ఛారిటబుల్ ట్రస్టు నుంచి రూ.2లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంటును శనివారం పొంగులేటి ప్రసాదరెడ్డి ప్రారంభించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న ఉద్దేశ్యంతోనే పీఎస్సార్‌ట్రస్టు ఆర్వోప్లాంటును వితరణ చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీటీసీ రేగూరి వాసవి నాయకులు వేగినాటి లక్ష్మీనర్సయ్య, కొర్లకుంటనాగేశ్వరరావు, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, ఉండెమోదుగుల శ్రీను, మామిడి వెంకన్న, జంగం లక్ష్మీనారాయణ, కుక్కల హనుమంతరావు, కళాశాల ప్రిన్సిపాల్ కోనేరు పద్మావతి, లెక్చరర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూసుమంచి: కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాదరెడ్డి మండలంలో పర్యటించారు. ఈశ్వరమాధారంలో సూర్యనారాయణరెడ్డి కుటుంబాన్ని, రాజుపేట గ్రామంలో విజయరెడ్డి కుటుంబాన్ని, జుజ్జులరావుపేట గ్రామంలో విజయారెడ్డి, నర్సింహరావు కుటుంబాలను, కూసుమంచిలో చెన్ను వెంకటరమణ కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. కూసుమంచి క్యాంపుకార్యాలయంలో శీనన్న నిరుద్యోగ కానుక ఉచిత క్యాంపు పోస్టర్‌ను రైట్‌ఛాయిస్ అకాడమీ ఛైర్మన్ మెండెం కిరణ్‌కుమార్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.

కిష్టారంలో ముగిసిన వైద్యశిబిరం

సత్తుపల్లిరూరల్, ఆగస్టు3: సింగరేణి ప్రభావిత ప్రాంతమైన కిష్టారంలో రెండు రోజుల ప్రత్యేక వైద్య శిబిరం శనివారంతో ముగిసింది.228మంది గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. జ్వరాలతో బాధపడే వారికి పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో కిష్టారం ఓసీ పీవో ఎంవీ.నరసింహారావు, వైద్యులు బీ.నరసింహారావు, శిరీష,వెల్ఫేర్ ఆఫీసర్ విజయసందీప్, సెక్రటరీ మద్దెల రవి పాల్గొన్నారు.

'స్టార్క్' సదస్సుకు ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు3: హైదరాబాదు జేఎన్‌టీయూ క్యాంపస్‌లో టెక్నాలజీ బిజినెస్ ఇన్ టు బేకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టార్క్ సదస్సుకు నగరంలోని ఎస్‌బీఐటీ విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. గత మార్చి నెలలో ఆన్‌లైన్‌లో ఆవిష్కరణలు జేఎన్‌టీయూ ఆహ్వానించిందన్నారు. రాష్ట్రస్థాయిలో 63గ్రూపులు రాగా, ఎస్‌బీఐటీ నుంచి 8 ఆవిష్కరణలు పంపామన్నారు. చివరి దశకు మూడు ఆవిష్కరణలు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ధాత్రి తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అమిత్‌బిందాజ్, అకడమిక్ డైరెక్టర్ గంధం శ్రీనివాసరావు అభినందించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కల్లూరు, ఆగస్టు3: మండలంలోని మర్లపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం తొపుడుబండి ఫౌండేషన్ తరుపున విద్యార్థులకు నోటు బుక్‌లు, స్క్రాప్ బుక్స్, టేబుల్, డ్రాయింగ్ బుక్‌లు అందజేశారు. ఆ సంస్థ అధినేత సాదిక్‌అలీ చేతుల మీదగా వాటిని అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రమణయ్య, హెచ్‌ఎం సోమ్లనాయక్, ఉపాధ్యాయులు హరిబాబు, రోజాను, ఆనుషా, సీఆర్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా,ఉపాధిరంగాలపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

ఖమ్మంటౌన్,ఆగస్టు3:విద్యా,ఉపాధిరంగాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపితే సహించేది లేదని, కేసీఆర్‌ను తెలంగాణ సమాజం ఎలా విస్మరించిందో కాంగ్రెస్ ప్రభుత్వానికి అదే గతి పడుతుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ హెచ్చరించారు. శనివారం నగరంలోని మాస్‌లైన్ కార్యాలయం రామనర్సయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన పీడీఎస్‌యూజిల్లాకమిటీ సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని, అందుకే విద్యార్థులు, యువత కేసీఆర్‌ను గద్దెదించిదన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయలేదన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు కిరణ్, సతీష్, వినయ్, శశి, కార్తీక్, స్టాలిన్, వంశీ, పృథ్వి పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, ఆగస్టు3: మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. వర్షంలో సైతం భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. భక్తులకు శ్రీ వెంకటేశ్వరస్వామి అన్నదాన సత్రంలో సేవా సమితి నిర్వాహకులు ఉచితంగా అన్నవితరణ చేశారు.

మా పనుల సంగతేంటి?

బదిలీపై వెళ్లిన అధికారి
ఇంటికి వెళ్లి ప్రశ్నించిన బాధితులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు3: ఖమ్మం నగరపాలక సంస్థలో అంత సవ్యంగానే ఉంది. నాకు బదిలీ జరుగుతోంది అనే అనుమానం లేదు, అనుకున్న ఓ విభాగం అధికారికి అనూహ్యంగా సాధారణ బదిలీల్లో ఇతర జిల్లాకు బదిలీ జరిగింది. అయితే బదిలీ కాకముందే సుమారు చాలా పనులు తానే చేస్తానని కమిట్‌మెంట్ ఇచ్చిన అధికారి బదిలీ సమయం వరకు కేవలం కొద్ది పనులు మాత్రమే అనుమతి జారీ జరిగింది. ఈ క్రమంలో అనుమతులపై ఉన్నతాధికారులకు అనుమానం రావటంతో మిగిలిన అనుమతులు నిలుపుదల చేశారు. ఒక్కసారిగా సదరు అధికారికి బదిలీ కావటంతో కథ అడ్డం తిరిగింది. దీంతో బాధితులు అధికారి ఇంటికి వెళ్లి మా సంగతేంటి అని ప్రశ్నించారని సమాచారం. బదిలీ కొద్ది రోజులేనని తిరిగి ఖమ్మానికి వస్తానని నచ్చజెప్పాడు. ఫైల్స్ అన్నిఅలానే ఉంటాయని బతిమిలాడి పంపాడు.

కార్యాలయ అభివృద్ధికి విరాళాల సేకరణ


డాక్టరేట్ పొందిన వారిని సన్మానిస్తున్న సభ్యులు

ఖమ్మంక్రైం, ఆగస్టు3: రిటైర్డు పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యాలయం మరమ్మతులకు విరాళాలు సేకరిస్తున్నట్లు పోలీసు రిటైర్డు అధికారులు ఆర్ రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ తెలిపారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం రిటైర్డు పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్‌లోని సభ్యులు కార్యాలయ మరుమ్మతులకు విరాళాలు ఇచ్చారని, ఇంకా దాతలు ముందుకు వచ్చి మౌలికసదుపాయాలు కల్పనకు కృషి చేయాలని విన్నవించారు. అనంతరం ఇటీవల డాక్టరేట్‌లు పొందిన రిటైర్డు సీఐ ఎంప్రసాదరావును, ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రిటైర్డు అయిన జేఎస్‌కే తులసీదాస్‌ను సన్మానించారు. ఈకార్యక్రమంలో పోలీసు వెంకన్న, ప్రతాపరెడ్డి, రామకృష్ణ, సుధాకర్, వెంకయ్య, శివాజి, నరసయ్య,జనార్ధన్, శ్రీనివాస్, పాషా పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజు కన్నుమూత



కారేపల్లి, ఆగస్టు3: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పార్టీమాజీ మండలాధ్యక్షుడు పూనెంరాజు (75) శనివారం కన్నుమూశారు. ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కోమట్లగూడెం పంచాయతీకి సర్పంచ్‌గా పనిచేశారు. రాజు మృతి తెలుసుకున్న మండల నాయకులు, పలుప్రాంతాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళ్ళులర్పించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానన్నారు.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు3: తమిళనాడు రాష్ట్రం రామనాథపురం జిల్లా వాసీని శనివారం అన్నం సేవా ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు అప్పగించారు. జమ్ముకశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్‌లో హవల్దార్‌గా పనిచేస్తున్న చంద్రన్ అనే వ్యక్తి గత నెల 22వ తేదీన ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడు గ్రామంలో తిరుగుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ వ్యక్తిని పోలీసులు నగరంలోని అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. వైద్యసేవల అనంతరం కోలుకుని వివరాలు వెల్లడించగా, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పేద కుటుంబం కావడంతో ఖమ్మం వచ్చేందుకు డబ్బులు లేక రైలులో తమిళనాడులోని తన ఇంటికి పంపించారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం


తల్లాడలో ప్రజాప్రతినిదులను సన్మానిస్తున్న సండ్ర


కల్లూరులో..

మండల, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం రేపటితో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా మండలాల్లోని ప్రజాప్రతినిధులను శనివారం అధికారులు, పలువురు ప్రముఖులు సన్మానించారు. వైరాలో ఎంపీపీ వేల్పుల పావని, జడ్పీటీసీ నంబూరి కనకదుర్గను, తల్లాడలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జడ్పీటీసీ దిరిశాల ప్రమీలను, కల్లూరు ఎంపీపీ బీరవల్లి రఘు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సన్మానించారు. ఏన్కూర్‌లో ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, జడ్పీటీసీ బాదావత్ బుజ్జిను అధికారులు సన్మానించారు. పాలనలో వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రజా సేవ చేయాలంటే పదవితో పనిలేదని వక్తలు పేర్కొన్నారు. పదవి లేకున్నా ప్రజాసేవలో మరింత ముందుండాలన్నారు. - నెట్‌వర్క్


వైరాలో..


ఏన్కూర్‌లో ప్రజాప్రతినిదులను సన్మానిస్తున్న దృశ్యం

రెండు తెలుగురాష్ట్రాల నాటికల పోటీల బ్రోచర్ ఆవిష్కరించిన భట్టి

ఖమ్మంటౌన్,ఆగస్టు3: నెలనెలా వెన్నెల ఏడో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 9,10,11తేదీల్లో నిర్వహించే రెండు తెలుగురాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీల బ్రోచర్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శనివారం ఆవిష్కరించారు. చింతకాని మండలంలో ఒక సమావేశంలో కళాపరిషత్ ఛైర్మన్ డాక్టర్ నాగబత్తిని రవి, నెలనెలా వెన్నెల నిర్వాహకులు ఏ.సుబ్రహ్మణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు తదితరులు భట్టిని కలిశారు. ఈసందర్భంగా నాటికల పోటీల బ్రోచర్‌న ఆవిష్కరించారు. ఈసందర్భంగా భట్టి మాట్లాడుతూ మూడురోజుల పోటీల్లో ఒకరోజు తాను కూడా నాటికలను వీక్షిస్తానని తెలిపారు. నాటికల పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.